ప్రపంచం

జూన్ 1978

రూ. పాయి

బంధం

మూలం: కే.యస్.మోహన్ వర్మ
తెలుగు: రుద్ర తులసీదాస్

స్కూటర్ వెనక కూచున్నప్పుడు ఆమెకు కాస్త వణుకు వొచ్చినట్టయింది, అంతకుముందు కురిసిన వానచినుకులకి తడవటంవల్ల, వీస్తున్న చల్లటిగాలికి శరీరం గగుర్పొడిచింది. కొంగు చివర్లతో మొహం తుడుచుకున్నది.

ట్రాఫిక్ సిగ్నల్ ఎరుపురంగువల్ల స్కూటర్ వేగం తగ్గింది.

"....నేరుగానే గదా వెళ్ళాల్సింది" అనడిగాడతను.

"ఔను"

అతను ఆమెమాటవిన్నట్టేఅనిసించలేదు. సిగ్నల్ రంగు ఎరుపునించి ఆకుపచ్చకి యింకా మారకముందే స్కూటర్ ముందుకు సాగింది.

దారి సాగుతోంది.

అవసరమని తోచినప్పుడు కూడా వెళ్ళాల్సిన దారి వివరాలు అతను అడగలేదు. అతను అడగలేదు కదాని ఆమెకూడా ఏమీ చెప్పలేదు.

"పాత లాంబ్రెట్టా అమ్మేశారా?"

"ఔను"

"లాంబ్రెట్టాలో వెనకకూర్చోవడం సౌకర్యంగావుండదు." జవాబు చెప్పడం ప్రారంభించాక, బదులుచెప్పడం అంత అవసరం లేదేమోననిపించింది అతనికి. అయినా—

"ఇప్పుడు దాని అవసరం లేదు గదా?" అన్నాడు.

అతని స్వరంలో ఏదైనా వ్యత్యాసం ధ్వనిస్తోందా అని ఆమె తీవ్రంగా గమనించింది. దాంట్లో నిరాశ ఎంతగా వుందో తెలుసుకోవాలని ఆమెకు కాంక్షగా వుంది.

"ఎందువల్ల?"

ఆమె ప్రశ్నకి బదులిద్దామా, వద్దా అనుకునేంతలోనే స్కూటర్‌కి చటుక్కున బ్రేకేశాడు.

ఏదో ఆక్సిడెంట్. రోడ్డుమధ్యలో ఆకారం కోల్పోయిన ఒక సైకిల్. చుట్టూ రక్తం. ముగ్గురు నలుగురు పోలీసులు. చుట్టూతా జనం.

మెడసాచి ఆక్సిడెంట్‌నిచూడాలనుకుందామె. ఏమీ కనిపించలేదు.

గుంపుకి చివరగా, తమకి దగ్గరగా వున్న ఒక ముసలాడిని "ఏమైంది. చచ్చిపోయాడా?" అనడిగేడు అతను.

"ఏమో. ఏమీ తెలీదండి" అన్నాడు ముసలాడు.

"ఎవరయ్యా చచ్చిపోయింది?" ఇంకొకతన్ని అడిగాడు.

"....."

"ఏం జరిగింది?" మరొకతన్ని అడిగాడు.

"....."

ఎవరూ బదులు చెప్పడంలేదు. అందరూ ఆత్రంగా ఆక్సిడెంట్ కేసే చూస్తున్నారు.

కాస్సేపు నిలబడి తరువాత స్కూటర్‌ని ముందుకు కదిలిస్తూ—

"రాంగ్ సైడ్‌లో సైకిల్ తొక్కాడో.... ఏమో?" అనుకున్నాడు.

మనుషుల సందడినుంచి దూరంగా వొచ్చాక ఆమె "ఏం చెప్పాడు?" అనడిగింది.

అతను వెనక్కి తిరక్కుండానే ఏమీ లేదని తలాడించాడు.

అతను ఎప్పుడూ అంతే!

మాటలకంటే తలపులకే ఎక్కువ వేగంవుంటుందని యిదివరలో తరుచూ అనేవాడు. ఔను!

ఇప్పుడూ అదే జరిగింది.

ఆఫీసు పని ముగించుకుని ఆమె బస్సుకోసం క్యూలో నిలబడింది. ఆఫీసులు వదిలిన వేళ. స్కూటర్లు, కార్లు సైకిళ్ళు రోడ్డుమీద ప్రవాహంలాగా కదిలిపోతున్నాయి. ఆమె మటుకు యివేవీ గమనించడంలేదు. తను ఎక్కాల్సిన వధ్నాలుగు-నెంబరు బస్సుకోసం అత్రంగా ఎదురు చూస్తూ నిలబడింది.

స్పీడుగా బస్టాండు దాటిన స్కూటరొకటి వెనక్కి తిరిగి ముందుకు వచ్చి ఆగింది. ఇదేమీ ఆమె గమనించలేదు.

"సుధా!"

ఆమె ఉలిక్కిపడింది.

చూస్తే—శ్రీవారు!

అతను చిరునవ్వు నవ్వాడు.

ఆనాడు-రిజిస్ట్రార్ ఎదురుగా కాగితాల్లో సంతకం పెట్టి, వదిలిపెట్టాక, ఇన్నాళ్ళకు-మళ్ళీ యిప్పుడు కనపడ్డారు.

అయిదారేళ్ళు గడిచినయి.

"ఇక్కడ....!" ఆశ్చర్యంగా అడిగింది. అందులో ప్రశ్నకూడా వుంది.

అతను జవాబుగా అదే చిరునవ్వు నవ్వాడు.

"వస్తారా? ఐ విల్ డ్రాప్ యూ ఎట్ యువర్ ప్లేస్!"

గోడ్డు మీదకు చూసింది. బస్సు జాడ ఉన్నట్టు అనిపించ లేదు. క్యూలో కొందరు వీళ్ళిద్దర్నీ చూస్తున్నారు.

ఆమె మనస్సు అటు యిటూ ఊగిసలాడింది. అతనితో వెళ్ళడమా? మానడమా??

ఆరోజు....తనకు విడాకులిచ్చి వదిలేసిన రోజున అతనన్న మాటలు గుర్తొచ్చినయి. "నో హార్ట్ ఫీలింగ్స్; మన మనసులు అతకవు. సో .... కాన్ట్ హెల్పిట్!"

ఒకప్పుడు భర్తగా తోడున్న వాడు



యిప్పుడు మిత్రుడిగా పిలుస్తున్నాడు.

అవును! తనకిప్పుడు ధైర్యం కావాలి; ధైర్యంగా ఉండాలి; లేదంటే జీవితంలో అపజయం కలుగుతుంది.

తమ స్కూటర్ పెనకకూచున్నాక హెచ్చరించాడు. "గట్టిగా పట్టుకో!"

యిదివరలో స్కూటర్ ఎక్కినప్పుడు అతని భుజాలచుట్టూ చేతులు వేసిన అలవాటు!

అయితే యిప్పుడు పీటు చుప్పన అసరాగా పట్టుకున్నది.

రోడ్డు మలుపు తిరిగాక ఉన్నట్టుండి "ఇప్పుడు వాకిళ్ళకడ్డంగా ట్రాన్స్ఫరయింది విన్నవే ఈ వూరు వచ్చాము" అన్నాడు

వచ్చిన వెంటనే తన గురించి చేసిన ప్రయత్నం చెప్పాడు.

"యిప్పుడు తమ కనిపించాక ఎలా వుంది; తృప్తిగా వుందా?" అని ఆమె అడగాలనుకున్నది కాని అడగలేదు.

తృప్తి కంటే అతనికి విరాళే కలిగి వుండాలి. ఎందుకంటే ఇద్దరూ విడిపోయాక తమ జీవితంలో ఓడిపోలేదు.

అతను స్కూటర్ని రోడ్డుపక్కగా ఆపాడు.

"దిగు. కాస్త కాఫీతాగుదాం. అంతలో ఈజల్లుకూడా తగ్గిపోవచ్చు" అన్నాడు.

జల్లు పడుతున్నప్పుడే లేదా మెకు. అప్పటికే ఆమె చీర తడిసిపోయి ముద్దయింది.

ఎదురుగా వున్న రెస్టారెంట్లోకి అతన్ననుసరించింది. కరెంట్ పోయినట్టుంది. వాళ్లో లేవిళ్ళ మీద పాడవాటి కొవ్వొత్తులు.

చీకటి అందాన్ని బహిర్గతం చేస్తూ కొవ్వొత్తుల వెలుగులు. చివరి టేబిల్ దగ్గర ఎదురెదురు కుర్చీల్లో కూచున్నారు.

ఎక్కడ్నుంచో గిటార్ శబ్దం సన్నగా తెరలు తెరలుగా వినబడుతోంది.

ఆమెకి ఎందుకనో గుండెలో ఏదో మూల భయం కదులుతోంది.

ఎదురుగా కూర్చున్న అతన్ని కొవ్వొత్తి చీకటివెలుగులమధ్య చూడానికి ప్రయత్నించింది. ఎంత ప్రయత్నించినా అతను స్పష్టంగా కనపడ్డంలేదు.

ఆమె మనసులో భయం ఎక్కువయ్యింది.

చీకటి నీడలాంటి భయం నుంచి తప్పుకునేందుకు ఆమె అకస్మాత్తుగా- "లీల మీతోపాటే వచ్చిందికదా!" అనడిగింది.

అతను లీలను పెళ్ళిచేసుకున్నాడని మాత్రం తను విన్నది. తరువాతి వివరాలు మాత్రం ఏమీ తెలీదు.

"లేదు. ఆమె చనిపోయింది;" అతని మాటలు వినబడీ వినబడనట్టున్నాయి.

అతనిమాటలు ఎంత సాధారణంగా వున్నాయో, ఆమె కంత ఆశ్చర్యం కలిగింది.

"ఎప్పుడూ?" అంది.

"పోయిన సంవత్సరం"

"ఎట్లా?"

"కాన్సర్ వల్ల"

కాస్సేపు ఏమీ మాట్లాడలేదు. ఆమెకి బాధేసింది. తర్వాత "ఐయాం సారీ;" అంది. నిజంగానే ఆమెకు దుఃఖం కలిగింది.

లీల మరణం గురించి ఇంకా వివరాలు అడుగుదామనుకుంది. అందువల్ల అతనికి లీల తాలూకు జ్ఞాపకాల్ని గుర్తుచేసి బాధ పెట్టటమే అవుతుందని మానేసింది.

అనలు లీలగురించి అడగటమే తప్పు అనిపించింది.

కప్పుల్లో కాఫీ నింపింది.

హాల్లో కొవ్వొత్తుల వెలుగు కన్నా చీకటిదే పైచేయిగా వుంది. కదులుతున్న జ్యోతులతో నీడలుకూడా కదుల్తున్నాయి.

కప్పులో పంచదార కలిపినప్పుడు "నాకు పంచదార వెయ్యొద్దు" అన్నాడు.

అతను "ప్రతిదినమూ ఇన్సులిన్ తీసుకుంటున్నాను" అన్నాడు.

పంచదార కలిపిన కప్పును మార్చి పెట్టింది.

ఇద్దరి మధ్యా కొంతసేపు మౌనం రాజ్యమేలింది. యిద్దరి మధ్యా బాధ బరువుగా సాగుతున్నట్టు స్పష్టంగా తోస్తూనే ఉంది

అమె ఎదురు చూస్తోంది-భయంగా ఎదురుచూస్తోంది-

నువ్వు సుఖంగా, ఆనందంగా వున్నావా? అని అతనడిగితే చెప్పేందుకు జవాబుని వెదుక్కుంటోంది.

ఆమెలో తుణ తుణానికీ ధైర్యం సడలసాగింది. మాటల కోసం తడుముకుంటోంది.

ఉన్నట్టుండి గిటార్ సంగీతం ఆగిపోయింది. వెంటనే బీట్ అలలు రేగినవి.

అమె చుట్టూ కావాలని తిరుగుతున్నట్టుకొత్తగా, కొత్తకొత్తగానీడలు.

ఉన్నట్టుండి "జల్లు తగ్గినట్టుంది-పోదాం-లే" అన్నాడతను,

అమె బదులుకోసం కూడా చూడకుండా అతను లేచాడు. వోడిపోయినట్టున్న స్థితిలో అమె అతనిని అనుసరించింది.

రెస్టారెంట్ మెట్లు దిగుతున్నప్పుడు ఆమెకు అంతా విరక్తిగా తోచింది. ఎప్పుడూ కలగనంతటి విరక్తి. కళ్ళకగ్గినిపించేప్రతీదాని అస్తిత్వంమీదావిరక్తి!

రోడ్లూ - మనుషులూ - కొట్లూ : ఇవన్నీ ఆమెదృష్టి కానటంలేదు. మనసంతా అనీజీగావుండిఅల్లల్లాడిపోయింది.

అతను స్కూటర్ వెనక సీటు తుడుస్తూ "నీకెట్లా కృతజ్ఞత చెప్పాలో తెలీటంలేదు. ఇలా ఒకతోడుతో బయటకు వచ్చి ఎన్నాళ్ళయిందో! ఇవాళెంత హాయిగా వుంది. సుధా! మెనీ మెనీ థ్యాంక్స్!" అన్నాడు.

ఆమె తలెత్తి అతడి మొహంలోకి చూసింది.

అతని చూపులూ. కదలికలూ తనకి పాతవే! అవన్నీ తనతో కొన్నినంవత్సరాలు కాపురంచేసినవే. కాని ఇప్పుడు?

"నేనింక నడిచిపోతాను. మా హాస్టలుకి ఇక్కణ్ణుంచి ఓ షార్ట్‌కట్ వుంది." అంది.

అతను ఆ మాటలకి రియాక్ట్ అయ్యేలోపునే అమె తన హాస్టలుకేసి వేగంగా అడుగులు వేసింది.